# బంజారాహిల్స్‌లో బంగళా!

తాళ్లూరి నాగేశ్వర రావు

బంజారా హిల్స్‌లో రోడ్డు నెం 12లో ఓ బంగళా ముందు ప్రీమియర్ పద్మిని డీలక్స్ స్పెషల్ కారాగింది. డీప్ వాటర్ బ్లూ కలర్ గల ఆ కారుపై అయిదున్నర గంటల సాయంత్రపు మెత్తని సూర్య కాంతి పడుతూ నీగ్రో కన్య బుగ్గలా మెరుస్తోంది.

ఆ కారులోంచి ఓ ముప్ఫై అయిదేళ్ళ స్త్రీ దిగింది. ఆమె వెంటే ఓ పధ్నాలుగేళ్ళ కుర్రాడు దిగాడు. ఆమె కారు లాక్ చేసింది

"మరి హిట్లరో!" అన్నాడా కుర్రాడు శాండ్ కలర్ సఫారీ సూట్‌లో ఆ కుర్రాడు కొబ్బరి పువ్వులా ముద్దుగా, ముచ్చటగా వున్నాడు.

"దాన్ని లోపలే వుంచుదాం" అందామె, సవన్నా గ్రీన్ కలర్ బ్యాక్‌గ్రౌండ్ మీద ఆరంజి ఫ్లవర్స్ బోర్డర్ గల అమెరికన్ పెట్రాన్స్ చీర ధరించిన ఆమె సంధ్యాకాశానికి ఎరుపెక్కిన మబ్బులా మనోజ్ఞంగా వుంది.

కారు వెనక సీట్లో ఖైదీలో వున్న గోల్డెన్ రిట్రీవర్ కుక్క "హిట్లర్" "మరి నేనో!" అన్నట్టు మెల్లగా మూలిగింది.

రోడ్డు మీద ఓ రెండు నిముషాల పాటు నిలబడి ఎదురుగా వున్న బంగళా కేసి తాపీగా తేరిపార జూసిందామె.

మెడలో వున్న పోలరాయిడ్ ఆటో ఫోకస్ కెమెరాతో ఆ బంగళాను ఫోటో తీశాడు ఆ కుర్రాడు.

పదకొండు వందల గజాల స్థలంలో మధ్యగా వుందా బంగళా. ముందు గేటూ, కాంపౌండ్ వాల్ మొగల్ ఆర్కిటెక్చర్‌తో మనోహరంగా వుంది. బిల్డింగ్ పక్కనే అయినా, కొలంబో కోస్టల్ తీరంలో వుండే బంగళాలను జ్ఞాపకం తెచ్చేట్టుగా ఉంది. ఫ్రంట్ ఎలివేషన్ ప్లాంట్‌గా వుండి, బంగాళా పెంకులతో అమర్చబడి, విలక్షణమైన అందంతో, హుందాతో, చూపులకు ఇట్టే ఆకట్టుకొనేట్టుగా వుంది. మెయిన్ గేటు లోంచి పోర్టికోకు అరవై అడుగుల సిమెంట్ రస్తా వుంది. దాని కిరు పక్కలా దివి నుండి దిగివచ్చిన దేవకన్యలు చిరునవ్వుతో ఆహ్వానిస్తూన్నట్టు రక రకాల గులాబి చెట్లు అర విరిసిన పువ్వులతో శోభాయమానంగా వున్నాయి. కుడిచేతి పక్కన చిన్న ఫౌంటెన్—అయితే అది పని చేయడంలేదు. దాని పక్కన వెల్వెట్ గ్రాస్ లాన్ వుంది. పోషణ అంత ఇదిగా లేదు. ఇక్కడక్కడా పెద్ద పెద్ద క్రోటన్లూ పూల చెట్లూ వున్నాయి. బంగళా వెనుక భాగంలో పెద్ద పెద్ద చెట్లున్నాయి, కాంపౌండుకు మూడు పక్కలా రక్షక భటుల్లా సర్వే చెట్లున్నాయి. అయితే వాటిని ప్రూనింగ్ చేసి ఎంత కాలమైందో! క్రమశిక్షణ లేకుండా పెరిగాయి, దూరానికి బంగళా కంటికింపుగా వుంది. బయట గోడ [illegible] నుకాయ రంగు వేసి వుంది. [illegible] బోర్డర్స్‌కు కలరు వుంది.

గేటు ఇరువైపులా మార్బుల్ ప్లాంక్ లు అమర్చి వున్నాయి. ఒకదాని మీద బంగళా పేరు-గ్రీన్ టాప్, మరోదాని మీద యజమానురాలు పేరు—ఆర్. సుశీలా దేవి.

గేటు తెర్చుకొని మెల్లగా ఆమె, ఆమె కొడుకూ లోపల ప్రవేశించారు. పోర్టికో లోకి పోయేవరకూ గార్డెన్ను పరిశీలిస్తూనే వుందామె.

పోర్టికోలో మినీ క్రోటన్స్, రాక్ ప్లవర్సు సిమెంట్ తొట్లలో పెట్టి వున్నాయి.

బెల్ కొట్టగా, లోపల్నుంచి ఓ నలభై యేళ్ళ స్త్రీ వచ్చి తలుపు తీసింది. స్లీవ్ లెస్ మీద నల్లంచుల తెల్లని ఆరెంజ్ చీర ధరించింది. మెడలో లాకెట్ గల సన్నటి బంగారు గొలుసు, చేతికి క్వార్ట్జ్ వాచీ, చెవులు బోసిగా వున్నాయి. నుదుటి మీద నల్లటి బొట్టు, వయస్సును దాస్తున్న అందంతో, పొంకంతో బిగువుగా వుంది. ఎత్తుకు తగ్గలావు; లావుకు తగ్గ లావణ్యం.

"సుశీలా దేవిగారు...." అందామె.

"అవును నేనే"

నమస్కారం చేసిందామె.

ప్రతి నమస్కారం చేసింది సుశీలాదేవి.

"నా పేరు లావణ్య—వీడు మా అబ్బాయి రాజేష్. ఈ బంగళా అమ్ముతారని విన్నాను. కనుక్కుందామని వచ్చాను. బ్రోకర్ల తో ఇష్టం లేక, స్వయంగానే వచ్చాను. అమ్మే ఆలోచన మీకేమైనా వుందా?" అంది లావణ్య.

"రండి, లోపలికి" ఆహ్వానించింది సుశీలా దేవి.

తల్లీ, కుర్రాడు లోపలికి వెళ్ళారు.

డ్రాయింగ్ రూంలో కూర్చున్నారు.

ఆ బంగళాకు తగ్గ హోదాతోనే వుంది డ్రాయింగ్ రూమ్. పెద్ద సోఫాసెట్, దాని ముందు టెకలం టేబుల్; టేబుల్ మీద ప్లవర్ వేజ్; ఒక పక్క టీ. వి, మరో పక్క రోజ్ వుడ్ స్టూలు మీద అమ్మవారి బ్రాంజి విగ్రహం, గోడలకు ప్రకృతి దృశ్యాల పెద్ద ఆయిల్ పెయింటింగ్స్, ఫ్లోర్ మీద కార్పెట్ స్ట్రిప్స్ గల విండో కర్టెను. ఆ డ్రాయింగ్ రూమ్ను పరిశీలిస్తున్నాడు రాజేష్. ఆ డ్రాయింగ్ రూమ్ డైమన్షన్లను ఊహించుకుంటోంది లావణ్య. పదహారు అడుగుల పొడవూ, పధ్నాలుగు అడుగుల వెడల్పూ ఉండొచ్చు అనుకుంది.

ఆ డ్రాయింగ్ రూమ్ పక్కనే డైనింగ్ హాల్. డైనింగ్ హాలునుంచి పైకి మెట్లున్నాయి.


"ఇల్లు చూస్తారా?" అంది సుశీలా దేవి.

అవునన్నట్టు తల ఆడించింది లావణ్య.

సుశీలాదేవి సోఫాలోంచి లేచింది. ఆమె వెంటే లావణ్య లేచింది. తనకంత ఇంటరెస్టు లేదన్నట్టుగా కూర్చునే వున్నాడు రాజేష్.

డ్రాయింగ్ రూమ్కూ, డైనింగ్ హాలుకూ మధ్య పార్టిషన్ వుంది. ఓరియంటల్ డిజైనుగల రోజ్ వుడ్ ద్వారానికి సిల్క్ కర్టెన్ వుంది. డైనింగ్ హాలు నుంచి రెండు బెడ్ రూమ్లకూ, కిచెన్కూ మార్గాలున్నాయి. డైనింగ్ హాల్ పెద్దదే. రెండు షో కేసులున్నాయి. వాటిలో మేడ్ ఇన్ చైనా డిన్నర్ సెట్లూ, ఫ్రాన్స్ నుంచి తెప్పించిన గ్లాసులూ, జపాన్ టీ సెట్, అమెరికన్ అన్ బ్రేకబుల్ డిన్నరు సెట్టు, 'సోనీ' గ్రైండరూ, హాకెడ్ రైసు కుక్కరూ మొదలైన సామాన్లువున్నాయి.

బెడ్ రూమ్లు అంత పెద్దవి కాకపోయినా ఫర్వాలేదన్నంత విశాలంగా ఉన్నాయి. మాస్టర్ బెడ్ రూమ్కు వాల్ టు వాల్ చెస్ట్ నట్ కలర్ టెకలాం వార్డ్రోబ్ వుంది. అందులో నాలుగు అల్మైరాలు; డ్రస్సింగ్ టేబుల్ అమర్చి వున్నాయి. గోడలకు వేసిన వెనీషనల్ వాల్ పేపరు అక్కడ కూడా దెబ్బ తిని వుంది. బెడ్ రూమ్లకు అటాచ్డ్ బాత్ రూమ్ లున్నాయి. బాత్ రూమ్లు ఫ్లోరింగ్ మార్బుల్, వెస్టర్న్ స్టయిల్ తో వున్నాయి.



బాత్ టబ్ - షవరింగ్ ఏర్పాట్లున్నాయి. తొమ్మిది అడుగుల మేరకు వైట్ గ్లేజ్డ్ టైల్స్‌వున్నాయి.

బెడ్ రూమ్‌ల తర్వాత కిచెన్‌కు రావడమైంది. ఆధునిక పద్ధతుల్లోనే కిచెన్‌వుంది. మార్బుల్‌తో ప్లాట్ ఫాంమ్ ఏర్పాటయి వుంది. ఒక పక్కన స్టీల్ సింక్ వుంది. ప్లాట్ ఫారం కింది భాగమంతా ప్లయివుడ్‌తో కవర్ చేసివుంది. లోపల సామాన్లు పెట్టుకో వచ్చు అంతేకాకుండా కప్ బోర్డువుంది. దాని పక్కనే స్టోర్ రూమ్ కూడా వుంది. అది వంటగదికి అందుబాటులోనేవుంది.

ఓ కారిడార్‌లోంచి బంగళా వెనుక భాగానికి వచ్చారు. వెనుక స్లాంట్ రూఫ్ గల వరండా వుంది. అందులోంచి బయటికి పోతే ఖాళీ ప్రదేశం—ముప్పై అడుగుల వెడల్పున ఓ చివర చిన్న ఔట్ హౌసుంది. సర్వెంట్ క్వార్టర్లు. ఇంటి వెనుక రకరకాల మొక్కలూ, చెట్లు వున్నాయి. వెనుక పక్క గార్డెనంతా గందరగోళంగావుంది.

ఇంటినంతా నిశితంగా, తాను ఉండే దృష్టితో పరిశీలించింది లావణ్య. ఎక్కడ కక్కడ ఏం మార్పులు చేయాలో, ఎట్లా చేస్తే బావుంటుందో ఆలోచించుకుంటూనే వుంది లావణ్య.

ఇల్లు చూసేటప్పుడు వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకోలేదు. లావణ్య నిశ్శబ్దంగానే, అభావంగానే అంతా చూసింది.

డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి కూర్చున్నారు.

"మీ వారేం చేస్తారు?" అంది సుశీలా దేవి.

"అమెరికాలో డాక్టరు మేం కూడా మూణ్ణెల్ల క్రితం వరకూ అక్కడ వున్నాం. కాని ఆ జీవితంతో, లైఫ్ స్టయిల్‌తో విసిగి పోయాం. ఇండియాలో సెటిల్ అవుదామని నిర్ణయించుకున్నాం. నేనూ, మా అబ్బాయి ముందు వచ్చాం. ఆయన రెండు మూడు నెలలో వచ్చేస్తారు. ఈ లోపల ఓ బిల్డింగ్ కొని రెడీ చేస్తే బావుంటుందని అనుకొన్నాను. అందుచేతనే ఇళ్ళ వేటమీద పడ్డాను. వారంనుంచీ రోజూ ఏదో ఒక బిల్డింగ్ చూస్తున్నాను. నిన్న శ్రీనగర్ కాలనీలో ఓ కొత్త బిల్డింగ్ చూచాను. మొన్న బర్కత్‌పురాలో.... అంతకు క్రితం శాంతినగర్‌లో.... మీ కొక్కరే ఇంట్లో వుంటున్నారా?" అంది లావణ్య.

"లేదు. మా అమ్మాయి, నేనూ వుంటున్నాము. సర్వెంట్లు వున్నారు. అమ్మాయి ఓ ఫ్రెండ్‌తో మ్యాటినీకి వెళ్ళింది." అంది సుశీలాదేవి.

"మీ వారు....?"

"మావారు ప్రస్తుతం బొంబాయిలో వుంటున్నారు. ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్స్ బిజినెస్. పోర్ట్ వీధిలో ఆఫీసుంది. అప్పుడప్పుడూ వచ్చిపోతూ వుంటారు. ఈ ఇల్లు నా పేరు మీదనేవుంది. డాక్యుమెంట్సన్నీ నా దగ్గరే వున్నాయి."

అంతలో సర్వెంట్ మెయిడ్ ట్రేలో కాఫీ తెచ్చి యిచ్చింది ముగ్గురికీ.

"మీకు ఇల్లు నచ్చిందా?"

"నచ్చబట్టే అడుగుతున్నాను."

"నాకూ బ్రోకర్లంటే బొత్తిగా పడదు. పార్టీలతో ముఖాముఖి మాట్లాడు కోవడమే శ్రేయస్కరం"

"అవును"

"బేరానికున్నా అస్కారంలేని రేటు చెబుతాను. అర్థాంతరంగా అమ్ముకుపోయే అవసరం నాకు లేదు. నేను అనుకున్న రేటు వస్తేనే అమ్మదామనుకుంటున్నాను."

"చెప్పండి ఆ రేటేమిటో!"

ఓ నిముషంసేపు ఆలోచించి, లావణ్య మొహంలోకి చూసింది సుశీలాదేవి. ఆమె మొహం నిమ్మకు నీరెత్తి నట్టుగా వుంది.

"ఆరు లక్షల, అరవై ఆరువేల, ఆరొందల అరవై ఆరు రూపాయిల అరవై ఆరు పైసలు. నాకు ఆరు అంకె అంటే ఇష్టం. అందుచేత పైసలతో చెప్పాను. మీరు ఆలో




1

చించి చెప్పవచ్చు. ఈ రేటులో మార్పు ఉండదు. మీ ఇష్టా ఇష్టాలు, నిర్మొహమాటంగా మాట్లాడుతున్నానని మరోలా భావించకండి. నా పద్ధతే ఇది" అంది సుశీలాదేవి.

ఆ రేటుకు తబ్బిబ్బు కాలేదు లావణ్య. గంభీరంగా, నిశ్శబ్దంగా నాలుగు నిముషాల పాటు ఆలోచించిందామె. కొసకు "సరే" అంది లావణ్య.

"డాక్యుమెంట్స్ డూప్లికేట్ ఇస్తాను. మీ లాయర్‌తో సంప్రదించండి" అంది సుశీలాదేవి.

"అలాగే అగ్రిమెంట్ వ్రాయించేటప్పుడు అడ్వాన్సు ఏమైనా ఇవ్వమంటారా?"

"అడ్వాన్సు లేనిదే అగ్రిమెంటు ఏముంది! అరవై ఆరువేల ఆరొందల అరవై ఆరు రూపాయల అరవై ఆరు పైసలు అడ్వాన్సుగా ఇవ్వండి."

అలాగే అంటూ లావణ్య

డూప్లికేట్ డాక్యుమెంట్లు ఇచ్చింది సుశీలాదేవి. అవి పుచ్చుకొని ఆ మరునాడు లాయర్ని సంప్రదించింది లావణ్య.

అడ్వాన్సు చెక్కు ద్వారా చెల్లించి, అగ్రిమెంట్‌లో ప్రవేశించారు లావణ్య, సుశీలాదేవి. అగ్రిమెంట్ ప్రకారం రెండు మాసాల గడువులోగా ఆ బంగళాను రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంది.

ం ం ం

తర్వాత నెల రోజులకు ఓ రాత్రి ఎనిమిది గంటలకు లావణ్య, రాజేష్ డిన్నర్‌కు హోటల్ బంజారాకు వెళ్ళారు. జంట నగరాల్లో వున్న హోటల్స్‌ను, బార్స్‌ను విజిట్ చేసి ఎక్కడ చైనీస్ డిషెస్ బావుంటాయో తెల్సుకోవడం రాజేష్‌కు సరదా. అందుకోసమే తల్లిని వారానికో మంచి హోటల్‌కు తీసుకెళ్ళమని వేధిస్తూ వుంటాడు.

హోటల్ బంజారాలో ఆ రోజు రాత్రి లావణ్యకు పాత స్నేహితురాలు శ్రీలేఖ తటస్థ పడింది. వాళ్ళూ వెరైటీ కోసం ఫామిలీతో అక్కడకు వచ్చారట. ఆమె భర్త ఓ పబ్లిక్ సెక్టర్ అండర్ టేకింగ్‌కు మేనేజింగ్ డైరెక్టరు. పరస్పర నమస్కారాలూ, పరిచయాలూ అయ్యాక స్నేహితురాళ్ళు ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

"ఎక్కడుంటున్నారు?" అంది లావణ్య.

"బంజారాహిల్స్, రోడ్డు నంబరు 12 లో" అంది శ్రీలేఖ.

"అదే రోడ్డులో నేనూ ఓ బంగళా కొన్నాను. అడ్వాన్సు ఇచ్చాను. ఓ నెలలో రిజిస్టర్ చేయించాలి."

"ఎవరిదా యిల్లు"

చెప్పింది లావణ్య.

"సుశీలా దేవి బంగళానా?"

"అంటే! ఆమె నీకు తెలుసా?"

"ఆమె నాకు వ్యక్తిగతంగా తెలీదుగానీ, ఆమె గురించి చాలా మందికి చాలా రకాలుగా తెలుసు."

"ఏమని?"

"ఏం చెప్పేది? కావాలంటే నేను విన్నది చెబుతాను."

"చెప్పు" అంది లావణ్య.

చికెన్ కార్న్ సూప్ పొగలు గమ్ముతూ టేబుల్ మీదకు వచ్చింది.

"ఆ బంగళాను ఆమె భర్త రామచంద్రం కట్టించాడట. అసలు రామచంద్రం ఎల్.ఐ.సి.లో ఓ మామూలు అసిస్టెంట్ ఉద్యోగి. అయితే నేం—మంచి మాటకారి. జంట నగరాల్లో అధికారులూ, అనధికార్లూ సహా మందితో అతనికి పరిచయాలున్నాయి. ఏ పనైనా ఇన్‌ఫ్లుయన్స్ ద్వారా ఇట్టే చేయించగలడు. అతనూ, సుశీలా దేవీ చిక్కడపల్లిలో డెభ్భై రూపాయల చిన్న పోర్షన్‌లో అద్దెకుండేవారట. అలాంటిది ఒక నెల రోజుల్లో లక్షాధికారి అయ్యాడు. ఉద్యోగానికి రిజైన్ చేశాడు"

"ఎలా లక్షాధికారి అయ్యాడు?"


"దాన్ని గురించే బోలేడు కథలు ఆమల్లో వున్నాయి. కొందరు చెప్పడం రేసుల్లో సంపాదించాడని, మరి కొందరు చెప్పడం స్మగ్లింగ్ బిజినెస్ వుందని, ఇంకొందరు చెప్పడం కోయంబత్తూరు నోట్లు మార్చాడని, వీటన్నిటినీ మించిన ఓ కథ ప్రచారంలో వుంది.

"ఏమిటది?"

"ఒకసారి రామచంద్రం ఓ మల్టి మిలియనీర్ ఫ్రెండ్‌తో ఫస్టు క్లాసులో కుపేలో ప్రయాణం చేస్తున్నాడట. ఆ ఫ్రెండ్ విమానాలు ఎక్కడట-హార్ట్ కంప్లెయింట్ వుండడంతో. ఆ ఫ్రెండ్ దగ్గర అతి రూపాయలదాకా క్యాష్ ఉందట. రేసు కోసం మద్రాసు వెళుతున్నారట. ఆ ఫ్రెండ్‌కు అర్ధరాత్రి హార్ట్ అటాక్ వచ్చి కావలి ప్రాంతానికి రైలు చేరుకునేప్పటికి చనిపోయాడట. ఆ క్యాష్‌ను రామచంద్రం తన పరం చేసుకొని ఆతర్వాత దాన్ని రేసుల్లో పదిరెట్లు చేశాడట. ఆ డబ్బుతో బంజారా హిల్స్‌లో బంగళా కట్టాడట. ఆ బంగళాను కాస్త తెలివిగలదీ, చురుకైనదీ, అందమైనదీ, ముందు చూపుగలదీ అయిన సుశీలా దేవి తన పేర పెట్టించుకున్నదట. ఇప్పుడు రామచంద్రం జాడ కచ్చితంగా ఎవ్వరికీ తెలీదు."

టేబుల్ మీదకు బటర్ చికెనూ, ప్రాన్స్ పలావూ, వెజిటబుల్ సలాడూ వచ్చాయి.

"అదెట్లా?" అంది లావణ్య విస్మయ కుతూహలంతో.




"సుశీలాదేవి క్యారెక్టర్ మంచిది కాదని చెప్పుకుంటారు. డబ్బు సంపాదించే వరకూ రామచంద్రాన్ని ఆరాధించింది. నడి మంత్రపు సిరి వొచ్చిపడగానే ఆమె బుద్ధులు పెడదారి పట్టాయట. ఆమెకు రామచంద్రం స్నేహితుడైన ఓ హోటల్ యజమానితో అక్రమ సంబంధముందట. ఆ విషయాన్ని తెల్సుకొన్న రామచంద్రం తన భార్యను చంపడానికి పరోక్షంగా ప్రయత్నాలు చేశాడట. ఆ రహస్యాన్ని సుశీలాదేవి గ్రహించింది. తాను ముందుగా జాగ్రత్త పడిందట. తత్ఫలితంగా ఒకరోజు రామచంద్రం హఠాత్తుగా అదృశ్యమైపోయాడు. బిజినెస్ మీద సింగపూర్ వెళ్లాడనీ, అక్కడ కింగ్స్ హోటల్‌లో ఎవరో మర్డర్ చేశారనే వార్తలు పొక్కాయి. కాని సుశీలాదేవి కథనం ప్రకారం బొంబాయిలో బిజినెస్ చేస్తున్నాడనే, రెండు నెలలకో మూడు నెలలకో వచ్చిపోతుంటాడనీ. ఈ మధ్య కాలంలో రామచంద్రాన్ని ప్రత్యక్షంగా హైదరాబాద్‌లో చూసినవాళ్లు ఎవరూ లేరు మరి."

"సుశీలాదేవి సామాన్యురాలు కాదన్నమాట"

"అనే అనుకోవాలి. ఇప్పటికీ ఆ హోటల్ యజమానితో 'డాట్సన్ బెర్రీ' కారులో తిరుగుతూనే వుంటుంది. అతను ఆమె బంగళాకు అన్ని వేళల్లో వెడుతూనే వుంటాడు. తన శీలాన్ని గురించి పట్టించుకోని స్త్రీ ఎంత సాహసానికైనా పాల్పడగలదు—అలాంటి స్త్రీని ఈనాటి సమాజం మాత్రం ఏం చేయగలదు? ఆమెకు డబ్బుంది; అందముంది; పరువు ప్రతిష్ఠలు గల పురుషుల అండవుంది. ఏమైనా చేయగలదు? చేసింది కప్పిపుచ్చుకోగలదు."

ఇద్దరూ బటర్ చికెన్ తినడంలో నిమగ్నులయ్యారు.

సుశీలాదేవి చరిత్ర విన్న తర్వాత

లావణ్య మనస్సులో ముల్లుగుచ్చుకున్నట్లయింది. తింటూ ఆలోచనలో పడింది. సుశీలాదేవి కథకూ, బంగళా కొనడానికీ సంబంధ మేముంది! ఒక్కొక్క బిల్డింగ్‌కూ, ఒక్కొక్క ఫ్యామిలీకీ....ఒక్కొక్క కథా వుండొచ్చు. వాట్ని గురించి పట్టించుకోవాల్సిన పనేముంది?—అని సరిపెట్టుకుంది లావణ్య.

అగ్రిమెంట్‌లోని తేదీ దాటక ముందే బంజారా హిల్స్‌లోని ఆ బంగళాను లావణ్య రిజిస్టర్ చేయించుకుంది.

రోడ్డు నెంబర్ 12లో వున్న బంజారా హిల్స్ బంగాళాలో లావణ్య ప్రవేశించింది. గేటుకు ఇరు వైపులా వున్న ప్లాంక్స్ మార్పించింది. ఒకదాని మీద ఇంటిపేరు, "లావణ్య" అనీ, మరోదాని మీద భర్త పేరు, "డా. రజనీ కాంత్" అనీ బ్లాక్ మార్బుల్ ప్లాంక్స్ మీద గోల్డన్ లెటర్స్‌తో వ్రాయించింది.

నాలుగు రోజుల్లో డా. రజనీ కాంత్ అమెరికా నుంచి వస్తున్నట్టు కేబుల్ వచ్చింది.

బంగళాకు కొన్ని రిపేర్లు చేయించింది లావణ్య, కొత్తగా రంగులు వేయించింది. ముందు గార్డెన్ బాగుచేయించింది. వెనుక కొన్ని చెట్లను కొట్టించింది.

ఆరోజు సాయంకాలం రాజేష్ గోల్డెన్ రిట్రెవర్ "హిట్లర్"తో బాల్‌తో ఆడుకుంటున్నాడు. బంగళా వెనుక వరండా కింద గార్డెన్ చైర్‌లో కూర్చుని "ఉమెన్స్ జర్నల్" లో బొమ్మలు చూస్తూ కూర్చుంది లావణ్య.

రాజేష్ బాల్ విసురుతుంటే, పరుగెత్తి కెళ్ళి ఆ బాల్‌ను తెస్తూన్నది 'హిట్లర్', ఒకసారి బాల్ కాంపౌండు ప్రక్కనున్న గడ్డి దుబ్బులో పడింది, ఆ బాల్ కోసం 'హిట్లర్' పరుగెత్తింది. కాని అది బాల్ జోలికిపోలేదు. ముందు కాళ్ళతో, మూతితో ఆ గడ్డి దుబ్బుల్ని తవ్వింది. అక్కడేముందోనని రాజేష్ వెళ్ళాడు. అది తవ్వుతూంటే చూస్తూ నిలబడ్డాడు వింతగా, విస్మయంగా. ఆ తర్వాత "మమ్మీ!" అని కేక వేశాడు రాజేష్ సంభ్రమాశ్చర్యంతో.

అక్కడకు వెళ్ళింది లావణ్య.

గడ్డి దుబ్బుల్ని తవ్వగా మట్టి బయట పడింది. ఆ మట్టిని మరికొంత తవ్వగా చేతుల, కాళ్ళ ఎముకలూ, పుర్రె బయట పడ్డాయి.

"ఏమిటి మమ్మీ!" అన్నాడు రాజేష్ భయంతో.

లావణ్యకు వొళ్ళు గగుర్పొడిచింది.

రాజేష్ తల్లిని మళ్ళీ అడిగాడు.

అసలు సంగతి చెబితే అబ్బాయి భయంతో దడుసుకుంటాడని లావణ్య గ్రహించింది.

"ఏం లేదురా! ఈ ఇంటి వాళ్ళకు స్టాలిన్ అనే కుక్క వుండేదట. దానికి జబ్బు చేసి చనిపోయిందట. ఇక్కడ పాతి పెట్టారట దాని బొమికెలే ఇవి" అంది లావణ్య మామూలు స్వరంతో.

రాజేష్ కనుబొమ్మలు ఎగుర వేశాడు ఆశ్చర్యాతిశయంతో.

కాని ఆ ఎముకలూ, పుర్రె కుక్కవి కావనీ, సుశీలాదేవి భర్తవనీ, రామచంద్రం బ్రతుకు అక్కడే భూస్థాపితమైందనీ—అనుకుంది లావణ్య. ■